క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

తిర్యాణి: మండలంలోని 15 మంది లబ్ధిదారులకు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు లబ్ధిదారులకు తులం బంగారం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మండ్ల జగదీశ్, మాజీ జెడ్పీటీసీ వెడ్మ కమల, ఎంపీటీసీ లక్ష్మిబాయి, మాజీ సర్పంచ్ మడావి గుణవంత్‌రావు తదితరులు ఉన్నారు.

చెక్‌డ్యాం నిర్మాణానికి భూమిపూజ

తిర్యాణి: మండలంలోని గడలపెల్లి పంచాయతీ పరిధి రోళ్లవాగుపై చెక్‌డ్యాం నిర్మాణానికి ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి శనివారం భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ భూగర్భ జలాల పెరుగుదల కోసం రోళ్ల వాగుపై రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో చెక్‌డ్యాం నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మండ్ల జగదీశ్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మడావి గుణవంత్‌రావు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల: మండలంలోని గుండాయిపేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని గుడ్లబోరి ఫీడర్‌లో, కౌటాలలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని విజయనగరం ఫీడర్‌లోని 11కేవీ లైన్‌లో మరమ్మతులు నిర్వహించనున్నట్లు కౌటాల ఏఈ రవీందర్ శనివారం తెలిపారు. మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మండలంలోని గుడ్లబోరి, వైగాం, టేకంగూడ, రణవెల్లి, విజయనగరం, తాటినగర్ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఆయా గ్రామాలలోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

టీయూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న శాంతి కుమార్

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం టీయూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు శాంతి కుమార్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా శ్రీధర్, అధ్యక్షుడిగా అశోక్ చందర్, ఉపాధ్యక్షులుగా తిరుమల్‌గౌడ్, సుజాత, ప్రధాన కార్యదర్శిగా గణేశ్, సంయుక్త కార్యదర్శులుగా శాంతిస్వరూప్, అర్షియా సుల్తానా, కోశాధికారిగా లక్ష్మీనారాయణ, కార్యదర్శులుగా శేఖర్, శ్రీకాంత్, విజయ్ కుమార్, అరుణలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సహా అధ్యక్షుడు భానుప్రకాశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



బోనాలతో మహిళలు

దహెగాం: మండలంలోని లగ్గాం గ్రామంలో బోనాల పండుగ ఘనంగా జరుపుకున్నారు. మహాశివరాత్రి పర్వదినం మరుసటి రోజు ఉమాచంద్రశేఖర స్వామి ఆలయంలో బోనాల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు తెలిపారు. శనివారం ఆలయ ఆవరణలో బోనాల నైవేద్యం వండి బాజాభజంత్రీలతో, శివసత్తుల నృత్యాలు, వీరఖడ్గం వేస్తు ఆలయంలోకి ప్రవేశించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించారు. మహిళలు, భక్తులు భారీగా తరలివచ్చారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పూలాజీ బాబా ధ్యాన మందిర వార్షికోత్సవం

తలమడుగు: మండలంలో కూచులపూర్ గ్రామంలో పులాజీ బాబా ధ్యాన మందిర 28 వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ధ్యానం మందిరంలో జెండాను పూలాజీ బాబా సంస్థాన్ అధ్యక్షుడు రవీందర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూలాజీ బాబా నేర్పిన అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడుచుకోవాలన్నారు. బాబా చూపిన మార్గంలోనే ప్రయణించాలని కోరారు. ధ్యానం అలవర్చుకొని, మానసిక ప్రశాంతత పొందన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మహిళలకు చీరల పంపిణీ

మంచిర్యాలటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రానికి చెందిన నారీ సేన ఆధ్వర్యంలో లక్సెట్టిపేట మండలం మన్నెగూడలోని మహిళలకు 200మందికి శనివారం చీరలు పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులకు అవసరమైన సరుకులను అందించారు.

పీహెచ్‌సీలో సిబ్బంది కొరత

- నర్సులు, ఎల్‌టీలు లేక తిప్పలు
- ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న గర్భిణీలు
- పట్టించుకోని అధికారులు



లింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

లింగాపూర్: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మారుమూల గిరిజన ప్రాంతం లింగాపూర్ పీహెచ్‌సీకి నిత్యం 50కి పైగా ఓపీ ఉంటుంది. ఈ పీహెచ్‌సీ పరిధి మూడు హెల్త్ సబ్ సెంటర్లు, 20కి పైగా హ్యాబిటేషన్ గ్రామాల్లో విస్తరించి ఉంది. కాగా ఆసుపత్రిలో ఒక వైద్యుడు, ఒక ఫార్మసిస్ట్ మాత్రమే సేవలు అందిస్తున్నారు. ప్రధాన ఎల్‌టీ లేక రక్తపరీక్షలు చేయించుకునే వారు ఇబ్బందులు పడుతున్నారు. మూడు ప్రధాన ఏఎన్ఎం పోస్టులు, రెండు స్టాఫ్ నర్సు పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి. దీంతో రెండవ ఏఎన్ఎంలపై అదనపు పని భారం పడుతుంది.

తగ్గుతున్న సంఖ్య..

వైద్య సిబ్బంది కొరత ఉండడంతో ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకు తగ్గుతోంది. సోమవారం కేవలం 10 మంది రోగులు మాత్రమే పీహెచ్‌సీకి వచ్చారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నిరుపేద ప్రజలకు వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే దిక్కు అయినప్పటికీ సిబ్బంది కొరత కారణంగా జైనూర్, ఉట్నూర్‌లలోని ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. పీహెచ్‌సీలో వైద్య సిబ్బందిని నియమించడంతో పాటు 24 గంటలపాటు వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

రవాణా సౌకర్యం లేక అవస్థలు..

ఏదైనా అత్యవసర చికిత్స కోసం చుట్టుపక్కల గ్రామాల నుంచి మండల కేంద్రంలోని ఆసుపత్రికి రావాలంటే రవాణా సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 30వేలకు పైగా జనాభా ఉన్నా కనీస సౌకర్యాలు కల్పించలేదని మండలవాసులు వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణీలను చికిత్స నిమిత్తం ఉట్నూర్, జైనూర్ ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాలంటే 30కిలోమీటర్ల దూరం ప్రైవేట్ వాహనాల్లో అధిక చార్జీలు చెల్లించి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీంతో గర్భిణీలు వైద్య సేవల కోసం నానా తిప్పలు పడుతున్నారు. మండలంలో 108 అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని గిరిజనులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సులు, ఎల్‌టీ, ప్రథమ ఏఎన్ఎం, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీ కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్యం అందిస్తున్నాం.

- అజిమొద్దీన్, వైద్యాధికారి, పీహెచ్‌సీ

24 గంటలు వైద్యసేవలు అందించాలి



లింగాపూర్ పీహెచ్‌సీలో 8 గంటలు కాకుండా 24 గంటలపాటు వైద్య సేవలు అందించాలి. రాత్రి వేళల్లో అత్యవసర చికిత్స కోసం మండలంలోని ప్రైవేట్ వైద్యుడిని సంప్రదించాల్సి వస్తుంది.

- ఆడే అంగూరిబాయి, లింగాపూర్

సిబ్బందిని నియమించాలి



లింగాపూర్ పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలి. సిబ్బంది లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో జైనూర్‌కు వెళ్తున్నాం.

- రాథోడ్ సరితాబాయి, లింగాపూర్

'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



మోడి ఆశ్రమ పాఠశాలలో కొనసాగుతున్న నైట్ స్టడీ అవర్

- రాత్రింబవళ్లు స్పెషల్ స్టడీ అవర్లు
- ఆశ్రమాల్లో ఎప్పటికప్పుడు టెస్టులు

కెరమెరి: మండలంలోని నాలుగు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 152 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఈ నెల 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులను పరీక్షకు పూర్తిస్థాయిలో సంసిద్ధులను చేసే దిశగా ఉపాధ్యాయులు దృష్టి సారించారు. ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే స్లిప్‌టెస్టులు, గ్రాండ్‌టెస్టులు, ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్లను ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారు. వీటిని విద్యార్థులు సైతం సద్వినియోగం చేసుకుంటున్నారు. ఉదయం 5 గంటల నుంచి 8:30 గంటల వరకు, సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 10.30 వరకు తరగతులు కొనసాగుతున్నాయి. అనార్‌పల్లిలో ఆశ్రమ పాఠశాలలో 22 మంది విద్యార్థులు పరీక్షలు రాయనునండగా, హట్టిలో 46, రాంజీగడలో 16, మోడిలో 68 మంది విద్యార్థినులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.

100రోజుల కార్యక్రమం

ఐటీడీఏ అధికారులు నవంబర్ 15 నుంచి పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వంద రోజుల స్పెషల్ యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీచర్లు రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ తరగతుల్లో ఆయా సబ్జెక్టులను చదివిస్తూ, విద్యార్థులకు ఉండే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు.

స్లిప్‌టెస్టులు నిర్వహిస్తున్నాం



సబ్జెక్టుల వారీగా స్లిప్‌టెస్టులు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల సందేహాలను స్టడీఅవర్లలో నివృత్తి చేస్తున్నాం. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం.

- ప్రేందాస్, హెచ్ఎం, హట్టి

ప్రత్యేక శ్రద్ధ



ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్న టెస్టులతో ఎంతో ప్రయోజనం ఉంటుంది. ప్రత్యేక తరగతులు విద్యార్థులకు ఎంతో దోహద పడుతున్నాయి. విద్యార్థులను దత్తత తీసుకొని ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం.

- స్వర్ణలత, హెచ్ఎం, మోడి

రంజాన్‌కు మసీద్‌లు ముస్తాబు



డౌనల్ ప్రాంతంలోని జామా మసీద్

సిర్పూర్(టి): మండలంలో ఈనెల 12 నుంచి నిర్వహించనున్న రంజాన్ వేడుకలకు సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని మసీద్‌లు ముస్తాబయ్యాయి. బస్టాండ్ ప్రాంతంలోని యెమీన మసీద్, పేట్‌మహెలా కాలనీకి చెందిన ఖదీమ్ మసీద్, డౌనల్ ప్రాంతంలోని జామా మసీద్‌లను రంగులతో పాటు విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండల కేంద్రంలోని ఖదీమ్ ఈద్గా, జదీద్ ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కౌటాల: వీర్దండి ఆలయంలో భక్తుల పూజలు

కౌటాల: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తాటిపల్లి గ్రామంలో గల శ్రీ సిద్ధి హనుమాన్ మందిరంలో రెండోరోజు శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సమీప గ్రామాల రైతులు ఎడ్లబండ్లపై జాతరకు రాగా అటు మహారాష్ట్రలోని భక్తులు నాటు పడవలపై జాతరకు వచ్చారు. వార్ధా నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం హనుమాన్ విగ్రహాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. బీఎస్పీ నాయకులు భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. తాటిపల్లి ఆలయ ఆవరణంలో 'కాడోక్' మరాఠి నాటికను ప్రదర్శించారు. వీర్దండి గ్రామ సమీపంలోని జై బీర్య హనుమాన్ మందిర్ ప్రశాంత్‌ధామ్‌లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి నది పుణ్యస్నానాలు ఆచరించారు. తుమ్మిడిహెట్టి ప్రాణహిత నది పుష్కర్ ఘాట్ ఒడ్డున గల శ్రీ శివ సంత కార్తీక్ స్వామి మహరాజ్ మందిర్ ప్రశాంత నిలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కౌటాల కంకలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

సిర్పూర్ నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని వీర్దండి గ్రామ సమీపంలోని వార్ధా నది సమీపంలోని జై బీర్య హనుమాన్ మందిర్ ప్రశాంత్‌ధామ్‌లో మహాశివరాత్రి జాతర మహోత్సవాల్లో శుక్రవారం రాత్రి ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తుమ్మిడిహెట్టి గ్రామ సమీపంలోని ప్రాణహిత నది పుష్కర్ ఘాట్ ఒడ్డున గల శ్రీ శివసంత కార్తీక్ స్వామి మహరాజ్ మందిర్ ప్రశాంత నిలయంలో పూజలు చేశారు. మారుతి మహరాజ్, ఆలయ కమిటీ సభ్యులు బండు, సాయినాథ్, ప్రకాశ్‌గౌడ్, విలాస్‌గౌడ్, బీజేపీ మండలాధ్యక్షుడు వానుపటేల్, నాయకులు భీమన్న, మధుకర్, చందు, చందన్‌ఖుడ్ తిరుపతి, రవి, మోరేశ్వర్, భీంరావు, ప్రదీప్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తులకు అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు



మజ్జిగ పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

కెరమెరి: మండల కేంద్రంలోని నెహ్రూనగర్‌లో గల శ్రీ వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో శనివారం ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. శుక్రవారం మహా శివరాత్రి సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తుల కోసం ప్రత్యేకంగా వంటలు తయారు చేశారు.

శివాలయంలో అన్నదానం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్ శివాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఏటా శివరాత్రి ఉపవాసాల విరమణ రోజు ఆలయంలో అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మేరు సంఘం అధ్యక్షుడు అశోక్, వెంకన్న, సతీశ్, విజయ్, నారాయణ, సాయి, అశోక్, మల్లేష్, దయాసాగర్, నరసింహ, శ్రావణ్, ప్రశాంత్, మధునయ్య తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

పెంచికల్‌పేట్: పంచకళపురి క్షేత్రంలోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో మహాశివరాత్రి రెండవ రోజు జాతరలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని, వీరభద్రుడిని దర్శించుకొని ఉపవాస దీక్షలను విరమించారు. భక్తులకు బీజేపీ నాయకులు, ఫ్రెండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. మూడవ రోజు ఆలయంలో ప్రభల ఊరేగింపుతో జాతర ముగియనున్నట్లు ఆలయ పీఠాధిపతి మూలమఠం శివప్రసాద్ తెలిపారు.

రైల్వేగేటు మూసివేత.. తప్పని వ్యథ

- తరచూ గంగాపూర్ రైల్వేగేటు మూసివేత
- పనుల పేరుతో వారం వ్యవధిలోనే రెండోసారి..
- ప్రజలకు తప్పని తిప్పలు



గంగాపూర్ రైల్వేగేటు

రెబ్బెన: ఏళ్లు గడుస్తున్నా మండలంలోని సగానికి పైగా గ్రామాల ప్రజలకు రైల్వేగేట్ తిప్పలు తప్పడం లేదు. పనుల నిమిత్తం మండల కేంద్రానికి రావాలన్నా.. పనులు ముగించుకొని ఇంటికి సకాలంలో చేరుకోవాలన్నా దారి మధ్యలో ఉన్న రైల్వేగేట్ (లెవల్ క్రాసింగ్) వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిందే. రైళ్ల రాకపోకల రద్దీ అధికంగా ఉండటంతో ఒక్కోసారి నాలుగైదు రైళ్లు వెళ్లే వరకు గేట్ తెరుచుకోని పరిస్థితి ఉంది. దీంతో అత్యవసర సమయంలోనూ గేట్ తెరుచుకునే వరకు వేచి చూడక తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో మూడవ లైను పనుల పేరుతో రోజుల తరబడి గేట్ మూసి వేస్తుండడంతో ప్రజల ఇబ్బందులు రెట్టింపయ్యాయి. మండలంలోని సగం గ్రామ పంచాయతీల ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవాలంటే ప్రత్యామ్నాయ రోడ్డు సౌకర్యం లేకపోవటంతో రోజుల తరబడి రైల్వేగేట్‌ను మూసి వేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

వారం రోజుల వ్యవధిలోనే రెండోసారి..

మండలంలోని గంగాపూర్, లక్ష్మిపూర్, పాశిగాం, తుంగెడ, మాద్వాయిగూడ, నంబాల, రాజారాం, ధర్మారం, నారాయణపూర్, కిష్టాపూర్, జక్కులపెల్లి, కొమురవెల్లి పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో సుమారు 20 వరకు ఆవాస గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవాలంటే తప్పనిసరిగా మండల కేంద్రంలో ఉన్న రైల్వేగేటు గుండానే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. రైళ్ల రద్దీ కారణంగా ఒక్కోసారి నాలుగైదు రైళ్లు వెళ్లే వరకు గేట్ తెరుచుకోకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వేసవి ఎండలు క్రమంగా పెరుగుతుండటంతో మండుటెండలోనే గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా రైల్వే శాఖ చేపట్టిన మూడవ లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా మండల కేంద్రంలోని రైల్వే గేట్‌ను తరుచుగా రోజుల తరబడి మూసి వేస్తున్నారు. ఈనెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు మూడు రోజుల పాటు రైల్వేగేటును మూసివేసిన అధికారులు తాజాగా ఈనెల 11 నుంచి 12 వరకు మరోసారి మూసి వేస్తున్నట్లు ప్రకటించారు. వారం రోజుల వ్యవధిలో ఏకంగా 5 రోజుల పాటు గేటును మూసి వేస్తే ట్రాకుకు అవతలి వైపు ఉన్న గ్రామాల పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు శూన్యం..

గేటును మూసి వేస్తున్న అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదు. రైల్వేగేటును రోజుల తరబడి మూసి వేసిన ప్రతీసారి నంబాల, నారాయణపూర్, కిష్టాపూర్ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవాలంటే తక్కళ్లపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇక గంగాపూర్, తుంగెడ, మాద్వాయిగూడ వైపు నుంచి వచ్చే ప్రజలు ద్విచక్ర వాహనదారులు, సింగల్‌గూడ వద్ద ఉన్న చిన్నపాటి అండర్ బ్రిడ్జి ద్వారా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. మండల కేంద్రానికి ఆనుకొని పాత కోల్ యార్డు గుండా రాకపోకలు సాగించేందుకు అవకాశం ఉన్నా కోల్‌యార్డులో ఉన్న బొగ్గు చూర దుమ్ముతో వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం పంచాయతీ ట్రాక్టర్ల సహాయంతో దుమ్ము లేవకుండా నీళ్లు పట్టే ప్రయత్నం కూడ అధికారులు చేయడం లేదు.

విద్యుత్ ఆదా చేయరూ..!



దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ ఏరియాలో ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్ పగలు కూడా వెలుగుతుంది. పంచాయతీ వీధి దీపాలు పట్టపగలు కూడా వెలుగుతున్నాయని, విద్యుత్‌ను ఆదా చేయరా.. అని పలువురు పంచాయతీ అధికారులను ప్రశ్నిస్తున్నారు.

రోగ నిరోధక టీకాలు ఇవ్వాలి

ఇచ్చోడ: గ్రామీణ ప్రాంతాల్లో రోగ నిరోధక టీకాల కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని డీఐవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని కేశవపట్నం, మేడిగూడ, గేర్జం గ్రామాల సబ్‌సెంటర్‌లో రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు రోగ నిరోధక టీకాలు ఇవ్వాలన్నారు. సమయానికి ఇవ్వడం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారు. కేశవపట్నం సబ్ సెంటర్‌లో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సీహెచ్‌వో బ్రహ్మానందం రెడ్డి, సిబ్బంది సచిన్, ఏఎన్ఎం జారుబాయి, ఆశవర్కర్లు రత్నబాయి, ఫర్జాన, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూలుపై స్పెషల్ డ్రైవ్

తాండూర్: మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటి పన్నును ప్రజలు సకాలంలో చెల్లించి గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు. ఇంటి పన్ను వసూలు కోసం వారం రోజుల పాటు నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి పన్ను వసూలు చేశారు. వారం రోజుల్లోపు ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను బకాయిలతో సహా చెల్లించాలని, లేని పక్షంలో గ్రామ పంచాయతీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ కార్యదర్శి తపాస్ కుమార్ ఉన్నారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఎదులాపురం: ఆదిలాబాద్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగించుకోవాలని ట్రస్ట్ చైర్మన్ యూనుస్ అక్బానీ అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యాసకులకు శనివారం ట్రస్ట్ కార్యాలయంలో సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ట్రస్ట్ సేవలను మరింత విస్తారిస్తామన్నారు. పేదరికాన్ని, నిస్సహాయతను పారదోలేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈసందర్భంగా వితంతువులు, ఒంటరి మహిళల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 315 మందికి వైద్యులు సమీరుద్దీన్, నుమి అంజుమ్‌లు చికిత్సకు సంబంధించి కార్డులను అందించారు. అంతే కాకుండా రంజాన్ దుస్తులు, ఆర్థిక సహాయం కోసం సాహెర్ సిద్దిఖీ, యూనుస్ అక్బానీలు 600 మందికి కార్డులు అందజేశారు.